క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మారిటైం బోర్డు చైర్మన్

ఒంగోలు అర్బన్: జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్య శుక్రవారం స్థానిక ప్రకాశం భవనంలో కలిసారు. మత్స్యశాఖలోని వివిధ కార్యక్రమాలపై సంబంధిత శాఖాధికారులతో మాట్లాడారు. పాలేరు, ముసి నదులు సముద్రంలో కలిసే ప్రాంతంలో పూడికతీత పనులు, ఫిష్‌ల్యాండింగ్ సెంగర్, ఫిషింగ్ హార్బర్ తదితర అంశాలపై చర్చించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు పంపిణీ


గ్లౌజులు అందిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య, మాధవరావు

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆర్థిక సహకారంతో శుక్రవారం చీమకుర్తి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు పంపిణీ చేశారు. పారిశుధ్య పనుల్లో గ్లౌజులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాధవరావు కుమారుడు పవన్ కుమార్ జ్ఞాపకార్థం వాటిని అందించారు. కార్యక్రమంలో కమిషనర్ వై.రామకృష్ణయ్య, గోపురపు చంద్ర, కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తిమ్మసముద్రంలో పొలం బడి

నాగులుప్పలపాడు: తిమ్మసముద్రం గ్రామంలో వరి పంటలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. వరి పంటలో నారుమడిలో ఉల్లికోడు రాకుండా 160 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలని సూచించారు. ఆఖరి దుక్కిలో 20 కేజీల జింక్ సల్ఫేట్ వేసుకుంటే ప్రధాన పొలంలో జింక్ లోపం రాకుండా ఉంటుందని తెలిపారు. రబీలో వేసిన పంటలకు డిసెంబర్ 15లోగా పంటల బీమా పథకంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శశికళ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారింది..
రోడ్డు పని ఆగింది..!


కొత్తపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు


రోడ్డు మధ్యలో చేరిన వర్షం నీరు


వర్షానికి కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్


రోడ్డు మధ్యలో మురుగునీటిలో పెరిగిన గడ్డి

- కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తపట్నంలో నిలిచిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.2.75 కోట్లతో శరవేగంగా రోడ్డు పనులు
- ప్రస్తుతం అసంపూర్తిగా నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం
- రోడ్డు మధ్యలో వదిలిన స్థలంలో నీరు నిలిచి దోమల ఉత్పత్తి
- వ్యాధులకు గురవుతున్న స్థానికులు
- వర్షాలకు రోడ్డు కోతకు గురైనా పట్టించుకోని అధికారులు, పాలకులు

కొత్తపట్నం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి ఆగిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి శరవేగంగా జరిగిన అభివృద్ధి పనులన్నీ ప్రస్తుతం అర్ధంతరంగా నిలిచిపోయి ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. కొత్తపట్నంలో నిలిచిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులే అందుకు నిదర్శనంగా ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తపట్నం మార్కెట్ యార్డు నుంచి కె.పల్లెపాలెం ఎస్సీకాలనీ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.2.75 కోట్ల నిధులు మంజూరు చేశారు. మార్కెట్ యార్డు నుంచి కొత్తపట్నం ఎస్సీకాలనీ వరకు ఆక్రమణలు కూడా తొలగించి రోడ్డును విస్తరించి శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టారు. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ఈ రోడ్డును ఎట్టకేలకు విస్తరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ కోసం 50 అడుగులు అవసరం కాగా, ఇవ్వడానికి స్థానికులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రోడ్డు వెడల్పు చేసేందుకు సహకరించారు. రెండు వైపులా 10 అడుగుల మార్జిన్ వదిలి 40 అడుగుల రోడ్డు వేయాలని నిర్ణయించారు. 40 అడుగుల రోడ్డు వేయడానికి రూ.2.75 కోట్ల నిధులు సరిపోకపోవడంతో 10 అడుగుల చొప్పున రెండు వైపులా సిమెంట్ రోడ్డు వేశారు. మధ్యలో 20 అడుగులు వదిలిపెట్టారు. మిగతా రోడ్డు వేయడానికి ఎస్టిమేషన్ వేసి మరో గ్రాంట్‌లో పెట్టి నిర్మించాల్సి ఉంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోడ్డు అసంపూర్తిగానే ఉండిపోయింది.

బీచ్ రోడ్డు కావడంతో నిత్యం రద్దీ...

కొత్తపట్నం పల్లెపాలెం బీచ్‌కి వెళ్లేవారితో నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. కొత్తపట్నం బస్టాండ్ నుంచి బీచ్ వరకు రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోయి అధ్వానంగా తయారైంది. వాహనాలు నడపాలంటే నరకం కనిపిస్తోందని వాహనదారులు అంటున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొట్టుకునే ప్రమాదం పొంచి ఉంది. లారీలు, బస్సులు, ఇతర భారీ వాహనాలు సైతం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. రోజూ వందల సంఖ్యలో బైక్‌లు, కార్లు తిరుగుతుంటాయి. ఇటీవల కార్తీక పౌర్ణమి రోజు కొత్తపట్నం బీచ్‌కి భక్తులు పోటెత్తారు. అంతకుముందు నెలలో వినాయక నిమజ్జనాలకు తరలివెళ్లారు. ఆదివారాలు, సెలవు దినాల్లో సరదాగా బీచ్‌కు వెళ్లేవారు భారీ సంఖ్యలోనే ఉంటారు. వీరంతా రోడ్డు దారుణంగా ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇంత రద్దీగా ఉండే ఆర్‌అండ్‌బీ రోడ్డును పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వ పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థానికులకు ఇబ్బందులు...

ఇరువైపులా ఉన్న గృహ యజమానులకు కూడా ఈ రోడ్డు విషయం తీవ్ర ఇబ్బందిగా మారింది. రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయి ఖాళీగా ఉన్న స్థలంలో వర్షం నీరు నిలిచి మురుగునీరుగా మారి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. తాము వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా చిరు వ్యాపారాలు చేసుకునేవారు, వాహనాలు పార్కింగ్ చేసుకునే వారు నరకయాతన పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డు మధ్యలో ఖాళీ స్థలంలో భారీగా నీరు నిలుస్తోంది. నీ నీరు బయటకు వెళ్లడానికి దారిలేక అక్కడే ఉండిపోతోంది. రోడ్డు కోతకు గురవుతోంది. అధికారులు, పాలకులు పరిశీలించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి వాహనదారులు, స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు


సంతనూతలపాడులోని పెద్ద చెరువు

- డిసెంబర్ 5న నోటిఫికేషన్, 8న ఎన్నికల నిర్వహణ

సంతనూతలపాడు: సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలల అవుతోంది. రైతులు పంటలు సాగుచేసుకునేందుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభమైనా రైతులకు చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద నిర్ణీత సమయానికల్లా రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేది. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భేరీజు వేసుకుంటున్న రైతులు.. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటు ద్వారా తమ నిర్ణయాన్ని తెలియజేసేందుకు సిద్ధమవుతున్నారు.

సంతనూతలపాడు మండలంలో ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలు...

సంతనూతలపాడు మండలంలో మైనర్, పెద్ద చెరువుల కింద 6 సాగునీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లకు కలిపి మొత్తం 36 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంతనూతలపాడు మండలంలో 6 సాగునీటి చెరువులు ఉన్నాయి. వాటిలో మైనంపాడు చెరువు కింద 103.22 ఎకరాలు, సంతనూతలపాడు చెరువు కింద 283.71 ఎకరాలు, గుమ్మళంపాడు చెరువు కింద 207.07 ఎకరాలు, ఎనికపాడు చెరువు కింద 159.68 ఎకరాలు, ఎండ్లూరు చెరువు కింద 599.68 ఎకరాలు, మద్దులూరు చెరువు కింద 423.50 ఎకరాల ఆయకట్టు ఉంది. 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న చెరువులకు అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఒక్కో నీటి సంఘంలో ఆరుగురు...

డిసెంబరు 5న సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను మండల తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి స్పెషల్ ఆఫీసర్లుగా గెజిటెడ్ అధికారి, సచివాలయ ఉద్యోగులను నియమించారు. వీరికి శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఒక్కో నీటి సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు. వీరిలో ఒకరిని చైర్మన్, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు.

> **ఎన్నికలు సక్రమంగా నిర్వహిస్తాం**
> సాగునీటి సంఘాల ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. డిసెంబర్ 5న నోటిఫికేషన్ విడుదలవుతుంది. 8వ తేదీ ఎన్నికలు నిర్వహించనున్నాం. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం.
> – వెంకటేశ్వరరెడ్డి, ఇరిగేషన్ ఏఈ

హక్కుల మార్గాన్ని అనుసరించండి

నాగులుప్పలపాడు: నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదంతో డిసెంబరు 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకునేందుకు అందరూ ముందుకు రావాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని జిల్లా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన సమీకృత వ్యూహం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ నాగులప్పలపాడు ఔట్రీచ్ వర్కర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో మండలంలోని నిడమానూరు గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితుల చట్టాల్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారి హక్కులను, చట్టాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి సమాజంలో వ్యాప్తి చెందకుండా వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.దివ్య నాగలక్ష్మి, విజయలక్ష్మి, స్థానిక మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఆహార వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఆంధ్రా బ్యాంకు 101వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులో గల గుడ్ న్యూస్ మినిస్ట్రీస్ అంధుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆహార వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీకే రాజేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందించారు. అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపి షీట్లు అందజేశారు. ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఒంగోలు రీజియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వైస్ ప్రెసిడెంట్ పీకే రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్రా బ్యాంకును స్థాపించి 101 సంవత్సరాలైన సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకులో ఆంధ్రా బ్యాంకు విలీనం అయినప్పటికీ పట్టాభి సీతారామయ్యను స్మరించుకుంటూ, ప్రజలకు ఆంధ్రా బ్యాంకు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఐసీఏ గ్లోబల్ కాన్ఫరెన్స్‌కు వాకా బసివిరెడ్డి


కాన్ఫరెన్స్‌కు హాజరైన వాకా బసివిరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ అసోసియేషన్ (ఐసీఏ) గ్లోబల్ కో ఆపరేటివ్ కాన్ఫరెన్స్‌కు ఆంధ్రప్రదేశ్ పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు వాకా బసివిరెడ్డి హాజరయ్యారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు సహకార రంగంపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ అంతర్జాతీయ సమావేశానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యారు. దాదాపు 100 దేశాలకు చెందిన 3 వేల మంది డెలిగేట్లు హాజరయ్యారు. ఈ సమ్మిట్‌కు ఒంగోలు కేంద్రంగా ఉన్న పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన నాయకుడు వాకా బసివిరెడ్డికి ఆహ్వానం అందింది. దాంతో ఆయన సమ్మిట్‌లో పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్

చీమకుర్తి రూరల్: సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రైతులకు ఏటా రూ.20 వేల సాయం, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికెళ్తే అంతమందికీ రూ.15 వేల చొప్పున తల్లి ఖాతాలో జమచేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తవుతున్నా కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల కోసం అమలు సాధ్యంకాని హామీలిచ్చారని, అధికారం వచ్చాక అమలుచేయకుండా ఖజానా ఖాళీ అని చెబుతున్నారని విమర్శించారు. హామీలు ఇచ్చేముందు ఖజానా గురించి కూడా ఆలోచించాలి కదా అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. హామీలు చూస్తే ఇప్పుడు నాకు భయమేస్తోందంటూ సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, అందులో భాగంగానే సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఐటీడీపీ, జనసేన పార్టీల సోషల్ మీడియా కార్యకర్తలు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అతని కుటుంబంపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారని, వాటిపై వైఎస్సార్ సీపీ నాయకులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తే పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ మానుకుని ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

డీఎల్‌డీవోగా మహాలక్ష్మి


కలెక్టర్‌కు బొకే అందిస్తున్న మహాలక్ష్మి

నాగులుప్పలపాడు: పంచాయతీరాజ్‌శాఖ ఒంగోలు డివిజన్ అభివృద్ధి అధికారిగా నాగులుప్పలపాడు మండల ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న మహాలక్ష్మిని నియమించారు. శుక్రవారం జెడ్పీ సీఈఓ చిరంజీవి నియామకపత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మహాలక్ష్మి కలిసి బొకే అందజేశారు.


ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షం

ఫెంగల్ ముసురు షురూ..!

ఫెంగల్ తుఫాన్ కారణంగా జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం మొదలైంది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీచాయి. సాయంత్రం 4 గంటల నుంచి రెండు గంటల పాటు వర్షం కురిసింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై తుఫాన్ నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది.

– సాక్షి, ఒంగోలు

వైభవంగా శత రుద్రాభిషేకం


విశిష్ట అలంకరణలో వల్లీ, భుజంగేశ్వర స్వామి ఉత్సవమూర్తులు

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు మహంకాళి శివప్రసాద్ ఆధ్వర్యంలో రుత్వికులు వేద మంత్రాల నడుమ శత రుద్రాభిషేకం, రుద్ర హోమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మొదట వల్లీ అమ్మవారు, భుజంగేశ్వర మూల విగ్రహ మూర్తులకు విశేషపూజలు నిర్వహించారు. ఈఓ ఎస్‌జీఆర్.నరసింహబాబు, భక్తులు పాల్గొన్నారు.

పదో తరగతి హిందీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు హిందీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, కృష్ణమూర్తి

కొత్తపట్నం: హిందీలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేకంగా హిందీ మెటీరియల్ తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు పల్లె కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం మన్నెం శ్రీదేవి చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా హిందీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి హిందీ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి తన సొంత నిధులతో హిందీ మెటీరియల్ తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేయటం వలన నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కె.హరిబాబు, వి.వెంకటకృష్ణ, మద్దిరాల శరత్‌బాబు, నాగమల్లేశ్వరావు, సీహెచ్ కోటేశ్వరరావు, డి.సాయికిషోర్, కె.రజినీకుమారి, షేక్ జిలానీబాషా, చక్కా కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు


సంతనూతలపాడులో పూజలు చేస్తున్న భక్తులు

సంతనూతలపాడు: స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీకమాస మాస శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎస్.బుజ్జిబాబుశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున నిర్వహించిన వినాయకుడి పూజలో పలువురు దంపతులు కూర్చున్నారు. మాస శివరాత్రిలో భాగంగా భారీగా అన్నదానం చేశారు. ఎండోమెంట్ ఈవో ఎస్.నారాయణరెడ్డి పర్యవేక్షించారు. సంతనూతలపాడు పెద్ద బజార్లోని సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలోని శివునికి కూడా మాస శివరాత్రి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు నేలపట్ల శ్రీనివాసశాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు దంపతులు పూజల్లో కూర్చున్నారు. అనంతరం అన్నదానం చేశారు.